

# మబ్బులో దర్బారు

గుంటూరు శేషేంద్రశర్మ

[మండు వేసవి; హోరుగాలి; పండుటాకులు రాలి గాలిలో ఎగిరి పోతున్నాయి. ఏవో కేకలు వినబడుతున్నాయి. ఇంతా ఏమిటంటే, గొర్రెలు తన పొలంలోపడి మేశాయని తగాదా; గొర్రెలను ఘోరంగా కర్రతో కొట్టాడు. ఒక గొర్రె చావుకు సిద్ధంగా ఉంది. రెండు వైపుల మనుష్యులూ వచ్చారు; చేతులు కలిపారు. రక్తపాతం జరిగింది. అందరూ వెళ్లిపోయారు. గొర్రె మటుకు రక్తం కారుతూ మరణరోదన చేస్తూ గిలగిలకొట్టుకుంటూ ఉంది. రోదనం హృదయ విదారకంగా ఉంది. దూరాన చెట్టుక్రింద కూర్చొని ఉన్న నేను దృశ్యం దగ్గరకు వెళ్లకుండా ఉండలేకపోయాను. చావబోతూ ఉన్న గొర్రెచుట్టూ మిగతావన్నీ చేరి మూగ కళ్లతో చూస్తూ ఉన్నాయి. నేను వెళ్లేసరికి చుట్టూ ఉన్న గుంపులో ఒక గొర్రె నావైపు చూచింది. "ఏమ్మనుష్యులయ్యా! మేమెక్కడ మేస్తే మీకెందుకు? ఈ భూమంతా మీదేనాఏమిటి?" అన్నది ఏవగింపుగా; నాకేం చెప్పాలో తోచలేదు. మరొక గొర్రె: "భూమంతా మీరే పంచేసుకున్నారు. ఈ భూమిలో మరెవ్వరూ లేరన్నట్లుగా కంచెలూ, కరగోడలూ పెట్టుకుని అడ్డగించుకున్నారు." ఈ మాటతోటి నా బుర్ర గిర్రువ

తిరిగిపోయింది. లోపల ఏదో కలకలం బయలు దేరింది. ఇంతలో మనోరంగంమీద తెర లేచింది.]

[రంగంలోకి పాత్రల — పంచ భూతాల — ప్రవేశం]

ఆకాశం:— (పృథివ్యాపస్తేజో వాయువులను జూచి) మనం ఎంతకాలం ఇట్లా మానవుడి దౌర్జన్యాన్ని చూస్తూ ఊరుకుంటాము?

భూమి:— ఓరే, అన్నయ్యలూ! ఈ బాధలు పడలేనురా. నా గర్భవాసాన పుట్టిన ఈ అమాయిక జీవవర్గాలు హింస పడటం చూస్తూ నిరంతరం రక్తవర్షంలో తడుస్తూ ఏమిటిరా నా బ్రతుకు? నేను భరించలేనురా.

తేజస్సు:— ఛీ, యీ దుర్మార్గులను మనం శిక్షించాలి, భూదేవీ!

జలం:— ఔను, ప్రళయమేఘాలు పంపి ఈ మానవలోకాన్నంతా ముంచి పారేస్తాను; ఈ వెధవలను త్రుంచి పారేస్తాను. నా సీమ లంతా విషపూరితం చేస్తున్నారు.

వాయువు:— అవును. నా సీమలనుకూడా నానా కల్లోలం చేస్తున్నారు. ఊరుకోడానికి వీల్లేదు. ఈ క్షుద్రులను ఝంఝా ప్రభంజనం పంపించి నక్షత్రవీథుల్లోకి ఎగరగొట్టేస్తాను.

ఆకాశం:— ప్ప్! మనం తొందరపడగూడదు. వీడు మీరు చెప్పినట్లు లోక కంటకుడయ్యాడు. రోదసీ కుహరాన్నంతా బాడిదచేస్తాడు. కానీ ముందు వాడిని పిలిపించి సన్మార్గబోధ చేసి చూద్దాం. అది విఫలమైతే — శిక్ష.

తేజస్సు:— వాడికి సన్మార్గ బోధ ఏమిటి! ఏనాటినుంచో ఎందరో చేశారు. యుగయుగాన వాడిని శిక్షించారు; ఉద్ధరిద్దామనుకున్నారు. కానీ లాభం లేకపోయింది. వాడికి మరణ శిక్షే విధించాలి.

ఆకాశం:— కాదోయ్ తమ్ముడూ! వాడిని అంతరింపజేయడానికి అరగడియ కూడా పట్టదు. కానీ వాడిలో బాగుపడే లక్షణాలు సూక్ష్మంగా నైనా ఉన్నాయనే ఆశ అనాదినుంచీ మమ్మల్ని [illegible]స్తూ ఉంది. లేకపోతే వాడెంత? నా అభి[illegible]యం ఏమిటంటే— వేదాంతిని వెళ్లి మానవు[illegible]ని తీసుకురమ్మందాం. మనమే ఒక్కసారి [illegible]క్షంగా చెప్పిచూద్దాం; భయపెడుదాం; మారే [illegible]చనలు కనబడకపోతే మీరన్నట్లే చేద్దాం.

తేజస్సు:— సరే పిలిపించండి.

[మనోరంగంలో దృశ్యం మారి పోతుంది.]

## 2

[భూలోక నగరంలో, మబ్బులు రాచుకునే మహల్లో మహత్తర వైభవంతో మానవుడు ఉన్నతాసనాసీనుడై ఉంటాడు. మంత్రులు, పురోహితులు, రాజకీయ నిపుణులు, శాస్త్రజ్ఞులు, ప్రజాస్వామ్యవాదులు, కవులు గ్రంథ కర్తలు, అందరూ పరివేష్టించి ఉంటారు.]

మానవ మహాచక్రవర్తి:— (అందరినీ చూచి నీలమేఘ స్వరంతో) చతుర్దశ భువనాల్లోనూ మా ప్రతాపం మారుమ్రోగుతూ ఉంది. నదులు, సముద్రాలు, దేశాలు, ఖండాలు, శిఖరాలు, శిలోచ్చయాలు, సమస్త భూమండలాన్నీ సాధించాము. కాలదూరాలు కరతలామలకం చేసుకున్నాము; వాయువీధి వశం చేసుకున్నాము. పంచభూతాలు పాదాక్రాంతం అయ్యాయి. మన విజయధ్వజం ఆకాశవీధుల్లో అడ్డు లేకుండా ఎగురుతూ ఉంది. కాని మనస్సుకు శాంతి కుదర లేదు; మనోరథం ఫలించలేదు. (నిట్టూర్పు విడిచాడు. ఒక్క క్షణం వెళ్లిపోయింది. తర్వాత మళ్లీ సభను జూచి) ఒక్క భూమండలంతో నాకు తృప్తి లేదు. (లేచాడు. చేయెత్తి) విదూర శూన్యంలో విహరించే ఆ గ్రహాలు, ఆ నక్షత్రాలు, ఆ సూర్యచంద్రులు సమస్త విశ్వం మా చరణ సీమల్లో చరించేలాగున చేయాలి. అంతవరకు మాకు నిద్రాహారాలు రుచించవు. ఏమయ్యా! శాస్త్రజ్ఞుడూ, ఏమిటి నీ అభిప్రాయం? (కూర్చుంటాడు.)

శాస్త్రజ్ఞుడు: చిత్తం. తమరి సెలవైతే సర్వ సన్నాహం చేస్తాను.

మానవ: ఏమి సన్నాహం; నీ తలకాయ? నీ అభిప్రాయం చెప్పవయ్యా అంటే, చిత్తం సన్నాహం చేస్తానంటావు. అసలు నేను చెప్పిం దేమిటో ఆలోచించావా?

శాస్త్ర: చిత్తం, తమరి చిత్తమే నా చిత్తం; నా మోహం నాకు ఆలోచన ఎందుకూ? తమరి సెలవు ప్రకారం ఏం చెయ్యాలో అది తూచా తప్పకుండా చేస్తాము. అంతే. కొండలు పిండి చేస్తాము, సముద్రాలు ఆవిరి చేస్తాము, గాలి ధూళి చేస్తాము.

మానవ: ఇక చాలు. చివరకు నన్నే నాశనం చేసేలాగున్నావు నీవు.

శాస్త్ర: ఎంతమాట! ఎంతమాట! తమరి సెలవుప్రకారం పోయేవాళ్లమే గానీ......

మానవ: కొంచెం నాకోసం ఆలోచించ వయ్యా. బొత్తిగా యంత్రంలాగయిపోతే ఎట్లా? నే ననే దేమిటంటే, మేము విశ్వవిజయం తలపెట్టాము. దానికి ప్రారంభంగా చంద్ర మండలం స్వాధీనం చేసుకోవాలి. ఏమంటావు?

శాస్త్ర: చిత్తం, అనే దేముంది? అంతా సన్నాహం చేయడమే. మంత్రులు ఆలోచన చెపితే బాగుంటుంది.

మానవ: నిజమే. (చిరునవ్వుతో) మంత్రు లుండగా ఆలోచన నిన్నే అడిగాను. ఆఁ— ఏమిటి మంత్రివర్యులూ! — ఊరుకున్నారేం?

మంత్రి: చిత్తం. మేము కార్యదర్శులతో చర్చించి చర్చ ఫలితం అందజేస్తాం.

మానవ: మరి మీరెందుకయ్యా కార్యదర్శు



స్నానానంతరం

చిత్రం—ఎం. శంకరరావు (అనకాపల్లి)

లతో ఆలోచించేలాగయితే? మీరా కార్యదర్శులతో ఆలోచించి చించేదేమీ ఉండదులే; మీ మొహాలే చెపుతున్నాయి. కూర్చోండి చాలు. సరే — శాస్త్రజ్ఞుడా! ఈ దండయాత్రకు మేమే స్వయంగా నాయకత్వం వహిస్తాము... (అంటూ ఉండగా)

ప్రజాస్వామ్యం: (లేచి అతి వినయంగా) ఒక మనవి.......

మానవ: ఆఁ — ఏమిటది?

ప్రజా: ప్రపంచంలో ఆర్థికదుస్థితి ఎక్కువై జీవితాలు దుర్భరమైపోయాయి. అంతా అల్లకల్లోలంగా ఉంది. ఈ పరిస్థితుల్లో తమరి దండయాత్ర లోకక్షేమం గాదని అభిప్రాయపడుతున్నాం. అంతే.

మానవ: సరే లేవయ్యా; ఇట్లాంటి కబుర్లకేం, ఎన్నయినా చెప్పవచ్చు. ఈ విషయాల్లో నీవు జోక్యం చేసుకోకు; నీకేవీ తెలీదు. కావలిస్తే, మేమే నిన్ను పిలుస్తాం, కూర్చో.

ప్రజా: చిత్తం. కూర్చుంటాను. కాని ఒక్క విషయం చెప్పి కూర్చుంటాను. కోపం వద్దు. మీరు నన్ను అద్దాలబీరువాలోని సువర్ణాక్షరాల బైండు పుస్తకంగా చేశారని లోకం అంతా అంటూ ఉంది.

మానవ: ఏడ్చారు. ఎవరా అనేది? (నవ్వుతూ) సువర్ణాక్షరాల బైండు పుస్తకం అద్దాలబీరువాలో గాకపోతే మరెక్కడుంటుంది. ఏదో యివన్నీ మాకు కాలక్షేపంకోసమేగానీ, చదివినవన్నీ చేసేలాగయితే యింకేముంది? మేము సన్యాసులం గావలసిందే.

[ద్వారపాలకుడు, ప్రవేశం]

ద్వారపాలకుడు: (అవనతుడై లేచి) వేదాంతి గారు దర్శనార్థం వచ్చారు.

*[మానవచక్రవర్తి, శాస్త్రజ్ఞుడు ఒకరి ముఖం ఒకరు చూస్తారు]*

శాస్త్ర: ఓహో! చంపేశాడు.

మానవ: (ద్వారపాలకుని చూచి) ప్రవేశ పెట్టు.

*[వేదాంతి — వివేకానందస్వామి లాంటి స్వరూపం — గంభీర వదనంతో ప్రవేశించాడు]*

మానవ: (దూరాన్నే వేదాంతిని చూచి) గురువుగారికి నమస్కారం. దయచేయండి.

వేదాంతి: (అరనవ్వుతో) ఏమిటి దయ చేయండి? గుమ్మంలో పెట్టిన దీపంలాగుంది మీ ఆహ్వానం. ఉభయార్థాలకూ అన్వయిస్తుందిగా (కూర్చుంటాడు).

మానవ: (నవ్వుతూ) అబ్బెబ్బే! గురువుల పట్ల అంత అపచారమా! ఊరక రారు మహాత్ములని తమబోటి మహాత్ములే అన్నారు. గురువుగారి దర్శనమివ్వడంలో విశేషమేమిటో?

వేదాంతి: విశేషని కేమిటిగానీ — ఏమిటి ఇంత బ్రహ్మాండమైన సమావేశం జరుపుతున్నారు? ఏదో పెద్ద గొడవే అయి ఉండాలి.

శాస్త్ర: చక్రవర్తిగారు వచ్చే శరత్తులో విశ్వవిజయార్థం చంద్రమండలంమీదకు దండయాత్ర తలపెట్టారు.

వేదాంతి: (వికటంగా నవ్వి) విశ్వదహనార్థం అనండి.

శాస్త్ర: ఏమిట్రా తమ్ముడూ ఈ సాహసం!

మానవ: గురువుగారికి అప్పుడప్పుడూ ఒళ్లు దగ్గరుండదులెండి. వారు పేరుకు సర్వసంగ పరిత్యాగులు, వాస్తవానికి అన్ని విషయాలు వారిక్కావాలి.

వేదాంతి: ఏమయ్యా, మానవుడా! నేను మీ పురోహితుడి ననుకున్నావా ఏమిటి? దేవుడి పేరు చెప్పి దేబిరించేవాడిని కాదు. సత్యాన్వేషణమే మాకు సర్వస్వమూ. మాకు నీతో ఏలాటి పనీ లేదు. ఈ దినం అంటేనో, విశ్వకల్యాణార్థమే నీ దగ్గరకు వచ్చాను.

"చేరి భిక్షాన్న మారగించెదము మేము,
కట్టెదము దిక్కులనియెడి కలితశాటి,
పవ్వళించెద మిలయను పానుపుమీద,
ఏమికార్యము మాకు నరేంద్రులందు?"

*[సభలో కలకలం బయలుదేరింది]*

మానవ: ఏమిటయ్యా గురువుగారూ! స్థలమూ, సందర్భమూ గుర్తిస్తారా? మా పరిహద్దుల్లో ఉన్నారు. అర్థం చేసుకోండి.

వేదాంతి: అర్థం చేసుకున్నాను. కాని నీ క్షేమం కోరేవాడిని నేనొక్కణ్నే అనేది నీవూ అర్థం చేసుకో. నీకు సంభవింపబోయే మహా విపత్తునుంచి నిన్ను రక్షిద్దామనే వచ్చాను. "వినయము జూపవేని పృథివీవర సాగెద మీక్షణంబునవే" (అని లేవబోతాడు).

*[సభ అంతా నిశ్శబ్దం అయింది]*

శాస్త్ర: సరే లేవయ్యా; అంత కోపం అయితే ఎట్లా? అసలు సంగతేమిటో తెల్చు.

మానవ: (సానునయంగా) మా కుతూహలం రెచ్చగొట్టి మాయమైపోతే మా గతి ఎట్లా గురూ! కూర్చోండి; సంగతేమిటో చెప్పండి.

వేదాంతి: మానవా! మేము స్వచ్ఛంద ప్రవర్తకులం. మాకు పరిహద్దులు లేవు. విశ్వంలో మేము లీనమవుతాము; మాలో విశ్వం లీనమవుతుంది. (మానవ చక్రవర్తి చిరునవ్వుతో చూస్తుంటాడు.) చీమనుండి బ్రహ్మవరకూ శీతాచలంనుండి చిల్లిగవ్వ వరకూ సర్వమూ మా జ్ఞానదృష్టికి సమానమే.

ఆకాశంలో నక్షత్రాలన్నీ నా వంశపు చిరకాల పూర్వీకులు, భూమాతకు అక్కయ్యలు. ఈ విశ్వక్రమఫలకం అంతా కరతలామలకం. నరుడినుండి నక్షత్రంవరకూ అంతా ఒకటే సూత్రం; అంతా ఒకటే శాస్త్రం. ఈ విశ్వపుతోటల్లో వికసించిన చుక్కల్లో విహరించే వేదాంతిని; నాకు పరిహద్దులేమిటోయ్?

మానవ: మీరేకాదు, గురువుగారూ, మిమ్మల్ని పుట్టించిన పంచభూతాలకు సైతం మా హద్దులు అతిక్రమించరానివి. (వికటమైన నవ్వు.)

వేదాంతి: పిచ్చివాడా! కళ్లుండీ సత్యాన్ని చూడవు. చెవులుండీ హితాన్ని వినవు. అనివార్యమైన పరిణామ చక్రంలో నీవు ఒక ఆకు మాత్రమే అని ఎరుగవు. అహంభావంచేత అర్థం చేసుకోటానికి తిరస్కరిస్తున్నావు. (కవులూ, గ్రంథకర్తలలో కరతాళధ్వనులు వినిపించాయి.) నీలో పరిణామం రాకపోతే నీ పతనం తప్పదు.

మానవ: (రోషపావకుడై) నోర్ముయ్! (అని ఆసనహస్తాన్ని అరచేత్తో చరుస్తాడు) నీ ప్రలాపాలకు ఇది తావుగాదు. చెట్లు క్రింద ముసలి వెధవలముందూ నీ ప్రతాపం; ఇక్కడగాదు. ఏదో గాలిలో బ్రతికేవాడివని వదలేస్తే ఇంతదూరం వచ్చావూ!



నిలాటి రేవు

చిత్రం—ఎస్. మారుతీ సూర్యారావు (గుంటూరు—2)

వేదాంతి: ఆ పొరపాటుచేతనే నీవు నా సలహా అమూల్యతను గుర్తించలేక అధోగతికి పోవడానికి సిద్ధంగా ఉన్నావు.

శాస్త్ర: మహాచక్రవర్తీ! అసలు వేదాంతి వచ్చిన కారణం ఇంతవరకూ తెలీదు. కొంచెం శాంతించండి, విషయం తెలుసుకుంటాను. ఒరే వేదాంతీ! మా కళ్లముందు పుట్టి మా చేతుల్లో పెరిగి మమ్మల్నే ధిక్కరించేంతవాడ వయ్యావట్రా?

వేదాంతి: అన్నయ్యా, నేనెప్పుడూ నిమ్ము ధిక్కరించలేదు. నీవే పొరపాటు పడుతున్నావు. మీ చేతుల్లో పెరిగి మీ కృషితో అభివృద్ధికి వచ్చిన నేను మిమ్మల్ని ధిక్కరించేంతటి మూఢుడిని కాదు. అసలు మూఢత్వానికే నేను విరోధిని. కాని ఒక్క మనవి—మీరు మీ విజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. మీకు హృదయం నశించింది. నేను మీ తమ్ముడిని





ఊఁహూఁ ఆఁహా

ఒక టీ చెంచాడు వుడ్‌వార్డ్స్ 'గ్రైప్‌వాటర్' ఇస్తే చాలు మీ శిశువు ఏడుపు మాని...సుఖంగా నిద్రించును!

శిశువుల జబ్బులు - వాయువువల్ల కడుపు ఉబ్బరం, పళ్లు చేయునప్పుడు జబ్బులకు, వుడ్‌వార్డ్స్ మాత్రమే సమకూర్చగల నివారణ కావలెను. వంద ఏళ్లకు మించి తల్లులు వుడ్‌వార్డ్స్ వాడుచూ శిశువులను పుష్టికరంగా పెంచియున్నారు.

వుడ్‌వార్డ్స్
'గ్రైప్ వాటర్'

ప్రపంచమంతటా 100 ఏళ్లనుంచి వాడబడుచున్నది.



అధికారయుత ఏజెంట్లు: హెర్బర్ట్స్ సన్స్ లిమిటెడ్., బొంబాయి. కలకత్తా మరియు లక్నో • టి.టి. క్రిష్ణమాచారి అండ్ కో., మద్రాస్ • ఎమ్.జి. షహాని అండ్ కో., (ఢిల్లీ) ప్రైవేట్ లిమిటెడ్, ఢిల్లీ.

Alyars AT 341-TL.

## మబ్బుల్లో దర్బారు

అనేది కూడా మరచిపోయారు.

శాస్త్రి: సరే లేవయ్యా. ఏమిటీ ఉపన్యాసాలు? అసలే ప్రపంచజ్ఞానం లేనివాడివి. నీ వెందుకీ గొడవల్లో ప్రవేశిస్తావు?

వేదాంతి: అదే పొరపాటు. ప్రపంచజ్ఞానం అంటే ఏమిటి? ఎనభై ఏళ్లవాళ్లు అనీ, అరవై ఏళ్లవాళ్లు అనీ, వయస్సు చూచి మూఢాత్ముల అనుభవాలకు మోకరించడమేగా ప్రపంచజ్ఞానం అంటే? ఎందుకా తుచ్ఛమైన లోకజ్ఞానం? ఒక్క టన్ను లోకజ్ఞానం అయినా ఒక్క జ్ఞానకాంతి కిరణానికి కూడా సరితూగదు. తెలుసా?

శాస్త్రి: జ్ఞా—న—కాంతి. మాటాడితే జ్ఞానమూ — జ్ఞానమూ — జ్ఞానము. ఏమిటోయ్ నీ జ్ఞానభండారం? ఏ మెరుగుదువు నీవు వాయుసంచారం తప్ప? టెంపరేచర్ అంటే ఏమిటి, వేడి అంటే ఏమిటో చెప్పు—

వేదాంతి: అదే మీ దృష్టికి, మా దృష్టికి భేదం. మీరు సంజ్ఞారణ్య సంచారులయితే, మేము సారార్థ సంగ్రాహులం. సాహిత్యంలో వైయాకరణుడికి, రసజ్ఞుడికి ఏ తేడా ఉందో, అదే మీకూ, మాకూ ఉండేది.

మీరు వివిధ శాస్త్రాల ద్వారా విశ్వాన్ని వేరు వేరు ముక్కలుగా అర్థం చేసుకుంటారు. అందుచేత మీకు అఖండ సత్యం అర్థంకాదు. నేను మీ శాస్త్రాలన్నీ జోడించి, ముక్కలన్నీ కలిపి సంపూర్ణ సత్యాన్ని సమన్వయం చేసుకుంటాను. అదే నా పాత్ర, అదే నా పరమార్థం. మీ తమ్ముడినే.

శాస్త్రి: పోనీలే; అసలు సంగతేమిటో చెప్పవయ్యా.

*[సభలో చెప్పండి, చెప్పండి అని కేకలు బయలుదేరుతాయి.]*

**వేదాంతి:** (అందరినీ చూచి) నేను పంచభూతాల దగ్గరనుంచి ఒక సందేశం తీసుకుని వచ్చాను. నన్ను ప్రస్తుతం పంచభూతాల దూతనుగా భావించాలి. (మానవ చక్రవర్తి, శాస్త్రజ్ఞుడు, తదితరులు ఆశ్చర్యచకితులవుతారు.)

మానవ: భావిస్తాం. ఏమిటా సందేశం? (అంటాడు సదర్పంగా.)

వేదాంతి: ఇదిగో పంచభూతాలు పంపిన సందేశం. (అని మానవ చక్రవర్తిని చూచి సందేశ పత్రిక విప్పి చదువుతాడు.)

"మానవా! నీ దౌర్జన్యం మితిమీరిపోయింది. స్వార్థం సరిహద్దులు దాటింది. విజ్ఞానం విషమయిపోయింది. నీవు విశ్వ సృష్టిని విధ్వంసం చేస్తున్నావు. అమాయిక

జీవవర్గాలను అణచివేస్తున్నావు. అవనీమండలం అంతా ఆక్రమించుకున్నావు. అందుచేత నీవు శిక్షాపాత్రుడవయ్యావు. ఈ భూగోళం సర్వ జీవరాసులకూ సమానంగా సంబంధించిందనే సత్యాన్ని గుర్తించి, స్వార్థాన్ని త్యజించి, విశ్వ కల్యాణమార్గాన్ని విడిచిపెట్టనని నీవు హామీ యివ్వాలి. ముందుగా వచ్చి మమ్ముల్ని కలుసుకుని సమాధానం సమక్షంలో యిస్తే సంతోషం." — ఇదీ సందేశం — సమక్షంలో సమాధానం యివ్వాలనే నా సలహాకూడా. ఆపైన మీ యిష్టం.

మానవ: (ఆగ్రహోగ్రుడై) హాయ్! (అని గర్జించి) ఈ పంచభూతాలకు యింత పొగరా! నన్నే శాసించాయా! నేనూ రాళ్లకూ రప్పలకూ, చెట్లకూ పుట్టలకూ మ్రొక్కే మా వైదిక పూర్వుల్లాంటి చాదస్తుడి ననుకున్నాయేమో! జాగ్రత!

*"గాలిం గుంభిని వహ్ని వాయువుల నా*
*కాశస్థలిం దిక్కులన్*
*రేలం ఘస్రములం దమఃప్రభల భూ*
*రిగ్రాహ రక్షోమృగ*
*వ్యాళాదిత్య నరాది జంతు కలహ*
*వ్యాప్తిన్ సమస్తాస్త్ర శ*
*స్త్రాళిన్ మృత్యువులేని జీవిని"*

(అంటూ పాదతాడనం చేస్తాడు.) తెలుసా?

వేదాంతి: ఔనౌను! "లోకములన్నియున్ గడియలోన జయించినవాడవు", కానీ "ఇంద్రియానీకము చిత్తమున్ గెలువనేరవు" (అని వెటకారంగా అన్నాడు.)

మానవ:— (మండిపడి పండ్లు గీటుతూ) హాయ్! నేను జయింపరానివి కూడా ఉన్నాయా? ఎక్కడున్నాయి చెప్పు మూర్ఖుడా! నా పరాక్రమాన్ని ఎదుర్కొన గలిగిన దీ చతుర్దశ భువనాల్లో ఎక్కడుంది?

వేదాంతి:— హాఁ (అని నిర్లక్ష్యంగా నవ్వి)

*"కలదబ్ధిన్ గలదా మరుత్తతుల నా*
*కాశంబునన్ గుంభినిన్*
*గలదగ్నిం దిశలం బగళ్ల నిశలన్*
*ఖద్యోత చంద్రాత్మలన్*
*గలదోంకారము న్త్రిమూర్తుల*
*త్రిలింగ వ్యక్తులం దంతటం*
*గలదో 'మానవరూపదానవ!'*
*కనం గానేలయీయాయెడన్."*

మానవ: ఛీ! అవతలికి పో మూర్ఖుడా! ఎవ్వరా అక్కడ దౌవారికులూ, వీడిని అవతలికి గెంటేయండి. (అనేసరికి సభలో శాస్త్రజ్ఞులూ, కవులూ, గ్రంథకర్తలూ అందరూ దిగ్గునలేచారు).

సభ: సహించం, సహించం, వేదాంతి ఉండాలి.

వేదాంతి: (అందరినీ కూర్చోమన్నట్లు సంజ్ఞ చేసి) ఓరీ మానవాధమా! ఏమి నీ జయగర్వం! ఉద్యోగం ఒకటి సంపాదించడం తోటే ఉన్నత శిఖరాన్నందుకున్నట్లేనా? పది రూపాయలు చేరడంతో పరమార్థం ఫలించినట్లేనా? నీవేమి సాధించావోయ్ ఈ విశ్వ ప్రపంచంలో? నీ ప్రతాపం,నీ అధికారం ఏపాటిదోయ్ యీ విశ్వ సృష్టిలో?

మానవ: ఒరేయ్ భటులూ! (అని గర్జిస్తాడు. భటులు ఆయుధపాణులు పరుగున వచ్చి వేదాంతిని రెండువైపులా పట్టుకుంటారు.)

[సభలో కేకలు]

వేదాంతి: అర్థం, అధికారం నీ రెండుకళ్లూ కప్పివేశాయి; నీకు ఉన్నత లక్ష్యాలు చూచే దృష్టి నశించింది. కవులూ, కళాకారులూ, నీకు కాలక్షేపం మాత్రమే అయిపోయారు. ధనికులూ, అధికారులూ ఆప్తులయ్యారు. గ్రుడ్డివాడా! కవులూ, కళాకారులేరా నీకు వెలుగుబాటలు; నీ పురోగమనానికి నిదర్శనాలు. ధనికులూ, అధికారులూ నీ పశుత్వానికి పట్టుగొమ్మలు.అ—ధి—కారులు (గట్టిగా) అధిక—అరులు.

మానవ: హేయ్ గెంటెయ్యరేమిట్రా? ఈడ్చుకు పోండి వెధవని. (అని గర్జిస్తాడు)

సభలో: వద్దూ! వద్దూ! అక్రమం! అన్యాయం! మానవజాతికే అవమానం! (అంటూ కవుల్లోనూ, గ్రంథకర్తల్లోనూ నిరసన సూచకంగా కొందరు సభలోనుంచి వెళ్లిపోతారు.)

వేదాంతి: (రెండు రెక్కలూ భటులు పట్టుకొని ఉండగా బలాత్కారంగా నిలుస్తూ) మానవా! చివరిసారిగా చెపుతున్నాను విను. నీవు అధికార గర్వంతో ఆర్థిక మదోన్మాదంతో ఉన్నత లక్ష్యాలను కోల్పోతున్నావు. అంధకారంలో అడుగంటిపోతావు సుమా! (అంటూ ఉండగా భటులు లాక్కుపోయారు)

మానవ: శాస్త్రజ్ఞుడూ! నీ తమ్ముడని సానుభూతి చూపిస్తున్నావా?

శాస్త్ర: ఛీ! నా తమ్ముడేమిటి? వెధవ—వాడు కులద్రోహి.

మానవ: మరేమిటి కర్తవ్యం?

ప్రజాస్వామ్యం: మీరు తొందరపడ్డారు మహా చక్రవర్తీ!

మానవ: ఎందుచేత?

ప్రజా: లోకమంతా తమరిని అట్లాగే అనుకుంటున్నారు. వేదాంతి చెప్పింది నిజమేనని నా అభిప్రాయంకూడా ప్రభూ!

మానవ: ఛీ నోర్ముయ్!

ప్రజా: చిత్తం (అని చేత్తో నోరు మూసుకుంటాడు).

మానవ: నీవెందుకోయ్ మాటిమాటికి అభిప్రాయ మంటావు; ప్రజ అంటావు; ప్రపంచ మంటావు; నీవు గోక్కునే జంధెప్పోచ లాంటి వాడివి. నీకా నోరిచ్చిన వెధ వెవడోయ్?

ప్రజా: (నోటిని మూసిన చెయ్యి అట్లాగే ఉంచి, మిగతా చెయ్యి చేతులు కట్టుకున్నట్లుగా రొమ్ముమీదనే ఉంచుకుని మూగసైగతో కూర్చుంటానని సూచిస్తూ కూర్చుంటాడు).

మానవ: ఏమయ్యా! కవులూ, గ్రంథకర్తలూ! ఎవరో మీలో కొందరు వెళ్లిపోయినట్లున్నారే! పోతే పోయారు. మీరున్నారుగా? ఆలోచన చెప్పండి; కీలుబొమ్మల్లాగున కూర్చోక.


కవి: చిత్తం మహాప్రభో!

మానవ: (అర్థోక్తిలోనే అందుకుని) అదే మీ కవులతో వచ్చిన గొడవ; మోకాళ్లమీద కూర్చొని బాకాల్లాగున స్తోత్రాలు ఊదేస్తారెందుకయ్యా? లోపాలు చెప్పండయ్యా. లోకాలు జయిస్తాం.

కవి: చిత్తం. తమ రాజ్యంలో...

మానవ: చిత్తం అనేది నిషేధిస్తాం—

కవి: చస్తాం ప్రభూ! అంతపని చెయ్యకండి. మనవి చేసుకుంటాము. తమరి రాజ్యంలో మాకు గానీ, మా జాతివారికి మరెవ్వరికిగానీ పనుల్లేవు. ఏదయినా అవసరముంటేగా అరవడానికి మేము.



సదనంలో వదనం

చిత్రం—అనుముల శ్రీహరి (హైదరాబాద్-2)

తమ సీమల్లో శాంతి భద్రతలు సమాధి కట్టుకుని సామ్రాజ్యం ఏలుతున్నాయి.

మానవ: ఆఁ! సమాధి అన్నారు, అదేమిటి?

కవి: చిత్తం, సమాధి అంటే—పతంజలి యోగశాస్త్రంలో "అమరా నిర్జరా దేవా త్రిదశా విబుధా స్సురాః" అన్నాడు.

మానవ: అంటాడు; వాడికి వేరే పనేముంది?

కవి: చిత్తం; అంటే......

మానవ: అవే! అసలుది చెప్పడం మాని ఏవో మంత్రాలు చదువుతారేమిటి కవిగారూ?

కవి: చిత్తం, అసలు దాన్ని గురించి చెప్పాలంటే ఆ గ్రంథం అంతా వస్తుంది మరి?

మానవ: ఓహో! అయితే మానెయ్యండి, బతుకుతాం.

కవి: మానేస్తే మేం చస్తాం ప్రభూ.

మానవ: మీకోసం మేం చస్తామా గురూ?

కవి: తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది,

ఏం చెయ్యమంటారు?

మానవ: భోంచెయ్యమంటాను.

కవి: చిత్తం, తమ పరిపాలనలో దాని కే కొరతా లేదు లెండి.

మానవ: కొంపదీసి శ్లేష గారు గదా—ఏమిటో కవిగాళ్లు! (నవ్వుతూ)

**కవి: అయ్యో అయ్యో, ఎంతమాట! మమ్మల్నే శంకిస్తే ఎట్లా సార్వభౌమా!**

మానవ: (సార్వభౌమ పదాన్ని బంతి పట్టుకున్నట్లుగా పట్టుకొనటం అభినయించి) ఇదేమిటి కొత్త పదమొకటి విసిరారు, మామిడికి—కంకరాయి లాగుంది?

కవి: లేదు ప్రభూ! వైస్రాయిలాంటిదే—ఇంకా పెద్దది.

మానవ: ఓహో! అర్థం? ప్రాణం తీయకుండా మానవభాషలో చెప్పు.

కవి: చిత్తం, చిత్తం. దేవభాష తీసెయ్యడమెట్లా ప్రభూ!

మానవ: అరే! ఇంకా దేవుడెవడయ్యా, మేము విశ్వవిజయం చేస్తుంటే?

కవి: నిజమే ప్రభూ! సార్వభౌముడంటే సర్వభూమికీ రాజు.

మానవ: ఛీ! విశ్వభౌమా అను.

కవి: అట్లా అంటే సరిపోదు ప్రభూ! విరాట్ అనాలి.

మానవ: ఛీ, విరాట్రాజనా ఏమిటి?

కవి: అబ్బెబ్బే! విరాట్ అంటే ఆదిదేవుడని ప్రభూ!

మానవ: (నవ్వుతూ) నీ పిండాకూడు, ఎప్పటికి గోష్ఠి తెగేది?

మంత్రి: అంత త్వరగా తెమలదులెండి మహాప్రభూ! వీడొక గొప్ప కాకతీయుడు.

మానవ: అంటే?

మంత్రి: అనగా—కాకా—కాకా ప్రభూ!—వీడు ఒక గొప్ప కాకాశాస్త్ర పారంగతుడు కనుక, కాకతీయుడు నా బరగె. వీడిని మంచివాటుదేరిన రాజకీయవాదికి అప్పగించేస్తే, ఆ పదజాలమంతా ఎండిపోయి మామూలు మనిషిగా తయారవుతాడు.

మానవ: ఊరుకోవయ్యా మంత్రిగారూ! కవిగాడిని కదిలిస్తే మనలాంటి తెలివివాళ్లని వాడి శ్లేషలకూ, వ్యంగ్యాలకూ బలిజేస్తాడు.

కవి: ఛీ నవ్వుల పాలయిపోతున్నాం; రండి పోదాం. (మిగతా సమూహాన్ని చూస్తాడు)

మానవ: ఆఁ! ఆఁ! ఆగండి మహాకవులూ, కాళిదాసులూ ఆగండి.

కవి: కా—ళి—దా—సులు; మోకాళిదాసులు. మా ఆత్మగౌరవమంతా మంటగలుపుకున్నాం. మీ సామ్రాజ్య వర్గీయులం కావడంకంటే స్వర్గీయులం అవడం మేలు.

మంత్రి: అట్లా అనకండి కవిగారూ! మీకూ, మాకూ ఉన్న చనువునుబట్టి వినోదంగా గోష్ఠి చేసుకున్నాంగానీ, మీరింతలో ఇంత ఇదైపోతే ఎట్లా? రండి. (అని వెళ్లి చేతులు పట్టుకుని తీసుకుని వచ్చి కూర్చోబెట్టుతాడు.)

కవి: (గంభీరంగా) మహాప్రభూ! తమరి సామ్రాజ్యంలో...

మానవ: ఆ, అట్లారండి — మా ప్రతాపం ఎట్లా ఉందో వర్ణించండి కాళిదాసుగారూ!

***[ప్రజాస్వామ్యం బిక్క మొగంతో వెక్కివెక్కి ప్రాథమిక పాఠశాల విద్యార్థిలాగున ఏడుస్తూ ఉంటాడు]***

మానవ: (ప్రజాస్వామ్యాన్ని చూచి) వీడేమిటయ్యా, వీడూ, వీడి ఏడుపు మొహమూను? ఓయ్ స్వామ్యం, ఇదిగో!

ప్రజా: (బిర్ర బిగుసుకుని పలకడు.)

మానవ: స్వామీ కాళిదాసుగారూ! మాకు చెప్పడం అయింతర్వాత వీడికీ కొంచెం ఓదార్చే కవిత్వం చెప్పండి.

కవి: "వసుమతీ భార ధూర్వహత నెవ్వని యుర్వరా వరాహాంక మర్థము వహించు" (అనే సరికి సభలోవారు సగం ఆసనాల్లో మూర్ఛపడి పోతారు)

మానవ: ఎక్కడా కాఫీకొట్టింది కాదుగదా, కాళిదాసుగారూ!

కవి: హా! (ఆసనంలో చదికిలబడి) ప్రభువులు మాకు అగ్నిపరీక్ష పెడుతున్నారు.

సభలో: అగ్నిలో పుటంపెడితే బాగుండును.

మానవ: (సభను చూచి) నిశ్శబ్దం—నిశ్శబ్దం—తర్వాత.

కవి: "అతడు వీరప్రతాప రాజరాజాధిరాజ రాజపరమేశ్వరాష్టదిగ్రాజకుల మనోభయంకరుండు........." (బాబోయ్ బాబోయ్ అని అందరూ ఉలికిపడి లేస్తారు. మానవచక్రవర్తి మంత్రులు మొదలైనవారిని వెళ్లిపోవచ్చునని సైగచేస్తాడు. వాళ్లు ఒకరివెంబడి ఒకరు పోతుంటారు)

కవి: పెద్దవాళ్లంతా వెళ్లిపోతే ఇక ఎవరికీ కవిత్వం?

మానవ: వాళ్లందరికీ తప్పినా, నాకు తప్పుతుందా కవిగారూ! మీరూ విశ్రాంతి తీసుకోవలసినట్లుగా కనుపిస్తున్నారు. (అంటూ పురోహితుడి వైపు చూస్తాడు.)

పురోహితుడు: ఇక ఈ వాయుగుంభన చాలించండి కవిగారూ?

కవి: ఆఁ! (అని నోరు తెరచి) అశ్రాంతమూ ప్రభువులవారి కధీనులం. మాకు విశ్రాంతి ఏమిటయ్యా? ఈ చివరి నివేదన అందుకోండి ప్రభూ!

మానవ: ఆహా! తప్పేదేముంది? ఊట్లా పడెయ్యండి.

కవి: "చాముండా పరమేశ్వరీ వరకృపా సంవర్ధితైశ్వర్య......"

మానవ: ఓహో ఇదేమిటి కవిగారూ! తిడుతున్నట్లుగా ఉంది. అర్థం కావడంలేదు.

కవి: ఛా ఛా లేదు దేవా!

మానవ: మరి ఛా ముండా అన్నారే?

కవి: చాముండా అంటే సప్తమాతృకలలో...

మానవ: సరే పురోహితులూ! (పురోహితుడ్ని చూస్తాడు)

పురో: చిత్తం! (అని కవినిజూచి) అయ్యా కాళిదాసుగారూ! మీరు మా సామ్రాజ్యానికీ, మాకూ విశ్వాసపాత్రులై శౌనక మహామునుల్లై ఎప్పుడూ కొలుస్తుంటారని ఆశిస్తూ, మీ స్తోత్ర విద్యా పాండిత్యానికి, ఇదిగో యీ బంగారు బాకా మీకు బహుమతి ఇస్తున్నాము. (అని బంగారు బాకా యిస్తాడు.)

కవి: మ హా ప్ర సా ద ము. (అని అందుకుంటాడు.)

***[ప్రసాదం అనేసరికి నిద్రపోతూ ఉన్న ప్రజాస్వామ్యం ప్రభృతులు తటాలున లేచి]***


ప్రజా: ఆఁ! ఆఁ! ఏమిటో ప్రసాదం అన్నారు. అది మా మొహాన కాస్త పారెయ్యండి.

పురో: ఓరి వెధవ పీనుగుల్లారా! ప్రసాదం అంటే పులిహోరా, దద్ధోజనం అనుకున్నారా ఏమిట్రా?

ప్రజా: ఆఁ! (అని నోరు తెరచుకుని నిర్విణ్ణుడై ఉండగా)

**(దృశ్యం మారిపోతుంది)**

**(సశేషం)**



చెన్నపురిలోని ప్రెసిడెన్సీ కాలేజి ఫోటో—మోహన్‌రాం (వెల్లూరు)

# మబ్బుల్లో దర్బారు

గుంటూరు శేషేంద్రశర్మ

జరిగిన కథ

మానవ మహా చక్రవర్తి విశ్వ విజయం తలపెట్టాడు. ఆతనిని తమ సమక్షానికి తీసుకొని రమ్మని వేదాంతిని పంపినవి పంచభూతాలు. వేదాంతి దౌర్జన్యానికి గురి అయ్యాడు.

(క్రిందటి సంచిక తరువాయి)

**3**

*[ఒక చిన్న కార్యాలోచన మందిరంలో శాస్త్రజ్ఞుడూ, పురోహితుడూ, రాజకీయ నిపుణుడూ నిరీక్షిస్తూ ఉంటారు. మానవ చక్రవర్తి ప్రవేశిస్తాడు. కర్తవ్యాన్ని గురించి దీర్ఘంగా చర్చిస్తారు. మొదట అంగీకరించకపోయినా మానవ చక్రవర్తి చివరకు నిపుణుల సలహా ప్రకారం సపరివారంగా పంచభూతాల సమక్షానికి వెళ్ళాలని నిశ్చయిస్తాడు.]*

[దృశ్యం మారిపోతుంది]

**4**

*[నీలవ్యోమ సీమల్లో మబ్బుల్లో దర్బారు. ఉరుములు మృదంగ ధ్వానులుగా శంపాలతలు నాట్యం చేస్తున్నాయి. ఉన్నతాసనాల్లో పంచభూతాలు పరికిస్తూ పారవశ్యం చెందుతున్నాయి. వేదాంతి శూన్యంలోకి చూస్తున్నాడు. అగమనధ్యానంతో అగ్నిపర్వత శిఖరం అనిపించే మానవ మహా చక్రవర్తి సపరివారంగా, సదర్పంగా దర్బారు ప్రవేశించి సభా మధ్యానికి వచ్చి పంచభూతాల ఎదుట విజయస్తంభంలాగున నిలుచుకొన్నాడు. భటుడు ఆసనం చూపగా మానవ చక్రవర్తి సపరివారంగా కూర్చున్నాడు. రోదసీ కుహరం ప్రతిధ్వనించే స్వరంతో ఆద్యంతరహితమైన ఆకాశం ప్రారంభించింది.]*

ఆకాశం: మానవా! మా సమక్షానికి వచ్చావు; సంతోషం. నీ పుట్టుపూర్వోత్తరాలెరుగుదుము. వృక్షం దగ్గరినుంచి నీవరకూ కూడా సర్వజీవరాసులకూ మాలో ఒకరైన భూదేవి ఆదిగర్భ కావడంచేత, చేయిచేసుకోను మనసు రాక, నీవు దుర్మార్గాన్ని వదలి ఏనాటికైనా వంశవర్ధనుడవవుతావని చిరకాలంనుంచీ ఆశించాము. వేదాంతులు, కవులు, కళామూర్తులు మొదలైన మహానుభావులను యుగయుగాన పంపించాము; శిక్షించాము. కానీ మా ప్రయత్నాలన్నీ ఎడారిలో పడ్డ వానచినుకు లయిపోయాయి. నిన్ను స్వార్థం ఆవరించింది. ఔద్ధత్యం అతిక్రమించింది. సృష్టిలో యావజ్జీవరాసులూ నిలువ నీడలేక నీ దాస్య భారం క్రింద క్రుంగి కృశించిపోతున్నాయి. అందుచేత మేము చివరకు స్వయంగా కలుగజేసుకుంటున్నాము. (తేజస్సును జూచి) తేజో దేవా! మన ఆదేశాన్ని అందజేయి.

తేజస్సు: (మానవుడిని జూచి) ప్రప్రథమంగా — భూగోళమంతా సర్వజీవరాసులకూ సమానంగా సంబంధించిందనే ప్రాథమిక సృష్టి సూత్రాన్ని నీవు గుర్తించాలి. రెండవది— జల వాయు ఆకాశ మండలాలు సర్వప్రాణి వర్గాలకూ సంబంధించినవి కావడంచేత నీ స్వార్థప్రయోజనాలకోసం నీ యిష్టానుసారంగా, తదితర ప్రాణివర్గ క్షేమానికి భంగకరంగా ఉపయోగించరాదు. ఇది మా ఆదేశం. దీనికి నీ సమాధానమేమిటి?

*[రాజకీయ నిపుణుడు బిక్కుబిక్కుమంటూ ఆసనంలో ఒదిగి ఉంటాడు. ప్రజాస్వామ్యం కుతూహలంతో ఆలకిస్తుంటాడు.]*

పురోహితుడు: భువనత్రయాధినేత అయిన మా మానవ చక్రవర్తి తన ప్రాభవానికి కళంకం అయినా, భూదేవిని చూచి ఇంత దూరం వచ్చారు. వారు మీ శాసన స్వరాన్ని ఎంత మాత్రం అంగీకరించరు. కానీ మీ ఆదేశం అన్న వాక్యాలకు వారి తరపున వారి శాస్త్రజ్ఞుడు సమాధానం ఇస్తాడు. (అని శాస్త్రజ్ఞుడి వైపు చూస్తాడు.)

శాస్త్ర: (లేచి గొంతు సవరించి) మీరు చెప్పిన సూత్రత్రయం మేము అంగీకరించం. అందులో మేము ఏ సూత్రానికీ బద్ధులం కాము. కారణం — ఒకటి భూగోళం సర్వజీవరాసులకూ సమానంగా సంబంధించిందనడం కేవలం మెట్ట వేదాంతం.

ప్రజాస్వామ్యం: కాదు, గురూ! నా మొహం చూచైనా ఒప్పుకోండి.

శాస్త్ర: ఛీ నోర్మూయ్! (మానవ చక్రవర్తి చకితుడై ప్రజాస్వామ్యం వైపు నిప్పు చూపులు విసురుతాడు.)

ప్రజాస్వా: అవునవును, సరే సరే, అబ్బే, సెబాస్, బాగుంది. (అంటూ సర్దుకుంటాడు.)

శాస్త్ర: (మళ్ళీ ప్రారంభించబోతాడు.)

వాయువు: (చేతో వారిస్తూ) మెట్ట వేదాంతం అన్నారే మీది సొట్ట రాజకీయం అని వేదాంతి అభిప్రాయమేమో!

వేదాంతి: ఉదాసీనంగా మానవుడిలో స్వార్థం ఉన్నంతవరకూ రాజకీయాలు వక్రంగానే ఉంటాయి.

శాస్త్ర: సర్వజీవరాసులూ సమానంగా లేవు. అందుచేత భూమిని సమానంగా అనుభవించడానికి ఒప్పుకోము.

తేజ: సర్వజీవరాసులూ ఎందుకు సమానం కావు?

మానవ: మానవుడి కొక్కడికే బుద్ధీంద్రియం ఉంది (అని ఆసనంమంచే హుంకరించాడు).

తేజ: ఉంది; అయితే?

శాస్త్ర: బుద్ధీంద్రియ సంపన్నుడే భువనత్రయానికి అధినేత.

వేదాం: హుఁ! (అని వెగటుగా నవ్వి) తేలుకు విషం ఎంతో మానవుడికి బుద్ధి అంతే.

మానవ: శెట్! ఇది వితండవాదం.

వేదాంతి: (నిర్లక్ష్యంగా) కాదు యిది సత్య స్వరూపం; నీవే నా సిద్ధాంతానికి ప్రత్యక్ష నిదర్శనం.

మానవ: నోర్మూయ్.

వేదాంతి: ఓహో! ఇది తమరి నగరం కాదు ప్రభూ!

మానవ: హుఁ! (అని హుంకరించి ఊరుకుంటాడు.)

తేజో: (శాస్త్రజ్ఞుడిని చూచి) ఊఁ— ఊఁ! (అని ప్రసంగం మరలించి) ఎందుచేత సర్వజీవరాసులూ సమానం కావు?

శాస్త్ర: ఇతర జీవరాసులు సౌధాలు కట్ట లేవు, సామ్రాజ్యాలు నిర్మించలేవు.

తేజ: మానవుడూ?

శాస్త్ర: నిర్మించగలడు.

తేజ: ఎట్లా?

శాస్త్ర: బుద్ధిబలంతో.

తేజ: ఆ బలం చీమలకుంటే?

వేదాంతి: (అందుకుని) చీమలు శిఖరాలెక్కి కూర్చుంటాయి. భూగోళాన్ని ఏకభోగంగా ఏలుకుంటాయి.

తేజ: అయితే మానవుడి ఘనత బుద్ధి మీద ఆధారపడి ఉందన్నమాట.

వేదాంతి: ఉన్నమాట కూడాను.

తేజ: అయితే శాస్త్రజ్ఞుడా! బుద్ధిని మానవుడు సృష్టించాడా?

శాస్త్ర: లేదు.

తేజ: అయితే బుద్ధి ఘనత మానవుడికి ఆపాదించడం ఎందుకు?

శాస్త్ర: (నిరుత్తరుడయ్యాడు.)

# నీలి రవ్వ

## దాశరథి కృష్ణమాచార్య

పరిమళాలు చిమ్మే హృదయపు అగరువత్తిని చేతపుచ్చుకుని
అణుబాంబుల వాళ్లను ఎదిరించిన నీలమణీ!
తెల్లవాళ్ల విశ్వవిద్యాలయంలో
నల్లవాడు ప్రవేశించి గెలిచాడని విని
ఎల్లలోకం నిన్ను మెచ్చుకుంటున్నది,
తననుతానె గిచ్చుకుంటున్నది.
అవును;
దమ్ములేని దద్దమ్మలు, దొమ్మీలు చేసేవాళ్లను చూసి
భయపడతారు
పరుగెడతారు.
మిత్తి నెత్తిన మొత్తి, కత్తిని తుత్తునియలు చేసిన
చిత్తస్థైర్యంగల చిన్నితమ్ముడూ!
ఉగ్రులైన నీగ్రోలకు నిగ్రహం నేర్పిన విగ్రహం నీది.
నల్లవాడు చదువుకోడానికి అవకాశం ఇవ్వడానికి వెనకాడే
'తెల్లమొహాల' గుండెలు తల్లడిల్లజేశావు.
బొగ్గులో వజ్రం ఉందని
శాస్త్రవేత్తలు కనిపెట్టిన సత్యాన్ని
మనుష్య రూపంలో
నిజం చేసిన యువయోధుడా!
నేను చీకట్లను ప్రేమించి చీవాట్లుతిన్న నీ స్నేహితుణ్ణి.
నాకు అంధకారంలో అందం ద్యోతకమైంది.
నలుపులోంచి నవనాగరకత ఉద్భవిస్తున్నది,
నలుపులోంచి వెలుతురు వికసిస్తున్నది.
మిత్తిని మొత్తి, గుండియ మెత్తని పువ్వులగుత్తులెత్తి, గ
మ్మత్తొనరించినట్టి నవమానవుడా! నినుగెల్చువాడు లే
డిత్తరి! నీకు నీవె బళిరే! సరివాడవు; నీ మనస్సులో
ఎత్తిన పూలదీపముల నెవ్వడు నార్పగలేడు, సోదరా!
నల్లనివాడ! జ్ఞాన నయనమ్ములవాడ! మనస్సులోపలన్
తెల్లనివాడ! హింసను వధించిన చల్లనివాడ! శాంతి పై
జల్లినవాడ! తెల్లని విషమ్మునకున్ విరుగైనవాడ! నా
ఉల్లములోనివాడ! పదవోయి విశాల విభా పథాలపై.

(మిసిసిపీ విశ్వవిద్యాలయంలోని తొలి నీగ్రో పట్టభద్రుడు జేమ్స్ మెరిడిత్‌నుద్దేశించి)

# మబ్బుల్లో దర్బారు

*[మానవ చక్రవర్తి ఆసనంలో ఠీవి వదలి ముందు వంగి కూర్చున్నాడు.]*

వేదాంతి: అప్రయత్నంగా లభించిన బుద్ధి మానవుడి గొప్పతనం గాదు. ఆ బుద్ధిని ఉపయోగించి తనలో ఉన్న దుష్టశక్తులను నిగ్రహించి సంస్కారాన్ని సాధిస్తే, అదీ మానవుడి గొప్పతనం. స్వయంగా కృషిచేసి సాధించేదే గొప్పతనం; ప్రకృతిసిద్ధమైన బుద్ధి మానవుడి గొప్పతనం కాదు.

*[పంచభూతాలు కరతాళధ్వనులు చేస్తాయి. ప్రజాస్వామ్యం కూడా కలుస్తాడు — మానవ చక్రవర్తి కల్లోల చకితుడవుతాడు.]*

తేజ: (వేదాంతిని జూచి) సంస్కారం అంటే?

వేదాం: "తనయందు అఖిల భూతములందు నొక భంగి సమహితత్వంబున జరుగువాడు."

తేజ: భూమి అంతా తనకే ఉండాలనడమూ, ధనమంతా తనకే ఉండాలనడమూ, సంస్కారం కాదన్నమాట?

వేదాం: (తన్మయహాసంతో) దేవా! సర్వజ్ఞానానికి మూలకందమైన తమకు తెలియందేముంది! అర్భకుడిని ఆడిస్తున్నారు. (అని నమస్కరిస్తాడు.)

తేజ: (వాత్సల్యంగా నవ్వి) లేదు వేదాంతీ! లోకంలో నీ మూలంగానే మేము ప్రతిఫలిస్తుంటాము. సత్య సుందరుడవు.

వేదాం: మహాప్రసాదం. (అని కరకమలాలు ముకుళించి అవనతుడవుతాడు. పంచభూతాలు ఆశీర్వాద హస్తాలతో వేదాంతిని దీవిస్తాయి.)

ఆకాశం: (నిమీలిత నేత్రాలతో మందహాస భాసురాలయిన అధరాలు విప్పి) "సమహితత్వంబున జరుగువాడు", ఆహా! చాలా శ్రవణానందంగా ఉంది వేదాంతీ! ఇంకా దీన్ని విస్తరించి చెప్పవయ్యా లోక సంగ్రహణార్థం.

వేదాం: (చిరునవ్వు నవ్వి) దేవా! మానవుడికి అందాన్నిచ్చేది, అఖండ ఔన్నత్యాన్నిచ్చేది, ఎప్పుడూ మనం బుద్ధి అనేదానికి పైస్థాయిలోనే ఉంది. తెలివితేటలు రావణాసురుడిలో లేవా? అయితే రాముడే ఎందుకు గొప్పవాడయ్యాడు? రావణాసురుడిలో లేనిదీ, శ్రీరాముడిలో ఉండేదీ ఆ ఆత్మ సౌందర్యం—అదే వారికి భేదం— అదే మానవుడు సాధించాలి.

భూదేవి: (హర్షపులకితయై) నాయనా! వేయేళ్లు వర్ధిల్లుతావు. మా వీనుల్లో తేనె వానలు కురిపిస్తున్నావయ్యా. ఇంకా చెప్పు.

వేదాం: తల్లీ! రుక్మిణీదేవి, కళ్యాణానికి

ముందు ఒక బ్రాహ్మణుడి ద్వారా శ్రీకృష్ణుడికి తన ఆత్మార్పణ సందేశం అందజేస్తుంది. ఈ బ్రాహ్మణుడు అనామకుడే అయినా, అష్టైశ్వర్య సంపన్నుడయిన శ్రీకృష్ణుడివి అతని ప్రసాదంతో కలుసుకుంటే, ఆ అనామక బ్రాహ్మణుడివి దూరాన్నే చూచి "తగ గద్దియ దిగ్గనడిగ్గి బ్రాహ్మణుం గూర్చుండ వియోగించి", భోజనం అయిన తర్వాత "లోకరక్షణ ప్రశస్తంబయిన హస్తంబున" అయిన కాళ్లు పిసికాడట ఆ భగవానుడు. ఆ దేవుడే ఏమన్నాడంటే—"సర్వలోక సుహృత్తములకు, ప్రాప్తలాభ ముదిత మానసులకు, శాంతులకును, సుజనులకు, గర్వహీనులకు వినతు లేనొనర్తు."

సంస్కారం అంటే అది. సాధువులకు దేవుడు కూడా నమస్కరిస్తాడు.

మానవ: (పరివారాన్ని చూచి) లేవండి పోదాం మనం; ఈ సన్యాసి కబుర్లు వినడానికి రాలేదు.

ఆకాశం: మానవా! ఇంతవరకూ మేము చెవిటికి శంకూదినట్లేనా? (అంటూ తేజస్సు వైపు చూస్తాడు.)

తేజ: అయితే మానవా! నీవు మా హితం వినవన్నమాట.

మానవ: హితం ప్రమేయ మేముంది ఇందులో? భూమి నా హక్కుభుక్తం — అంతే. (అన్నాడు దర్పాంధంగా.)

తేజ: ఏ శాస్త్రప్రకారం?

మానవ: నా శాస్త్రప్రకారం.

తేజ: అంటే?

వేదాం: (మానవ చక్రవర్తిని జూచి) ఏమిటయ్యా నీశాస్త్రం? నీ చట్టాలను చూచి నీవే సిగ్గుపడవలసిందిఅంటుంచి ఘనంగా చెప్పుకుంటున్నావు! తేజోదేవా! మానవుడి చట్టాల నిజస్వరూపం ఏమిటంటే, నాదాంట్లోకి ఎవ్వడూ ప్రవేశించగూడదు - - అన్న తలపులోని "నా" అనే స్వార్థాన్ని సమర్థించి సంరక్షించేవే మానవుడి చట్టాలు.

తేజ: అయితే, వేదాంతీ! 'నా' అనేది నశిస్తే?

వేదాంతి: నశిస్తే ఏముంటుంది? చట్టాలు బీరువాల్లోని బుక్కులు. ఈ అన్యాయవణిక్కులు అంతా కట్టకట్టుకుని భోగిమంటలో సహగమనం చెయ్యవలసిందే.

తేజ: అయితే మానవా! నీ చట్టాలన్నీ కచ్చితంగా నీవయినా అమలు జరువగలిగావా?

*[మానవ చక్రవర్తి ప్రత్యుత్తరం లేదు.]*

వేదాంతి: మహాదేవా! ఈ సందర్భంలో ఒక అభియోగం వినాలి.

తేజ: ఏమిటది?

వేదాంతి: మానవుడు నానా జంతు శకుంత సంతానాలకు జన్మభూములయిన అరణ్యాలను అక్రమంగా ఆక్రమించుకొని, ధ్వంసంచేసి పల్లెలూ పట్నాలూ నిర్మిస్తున్నాడు. ఆ దాడుల్లో అనేక జంతువులను, పిట్టలను పట్టి ఖైదీలుచేసి దాస్యంలో ఉంచుకుంటున్నాడు. ఇది మూర్ధన్య జీవకోట్లు మానవుడిమీద వేసే అభియోగం. (మానవ చక్రవర్తి హుంకరిస్తూ సపరివారంగా లేస్తాడు.)

భూదేవి: (ఖిన్నవదనంతో) మానవా! ఈవేధవ పనులు మానవా! (అని మానవుడి దిక్కుగా చేయి చూపుతుంది దీనంగా.)

మానవ: హుఁ (అని గర్జించి పరివార సమేతంగా సరభసంగా సభవీడి వెళ్లిపోతాడు.)

*[పృథివ్యాప స్తేజో వాయువులు, ఆకాశం ముఖం చూచాయి.]*

ఆకాశం: హుఁ (అని వికటంగా నవ్వి డిహ) పతనం ప్రారంభం అయింది. వేదాంతీ! నీవొక్కడ వేనయ్యా మా ఆశాలతకు పట్టుగొమ్మవు. నీవు నీచేతనయినంతవరకూ చెయ్యి. నీ విక వెళ్లిపో. నీకు శుభ మవుతుంది.

వేదాంతి: ఆదిదేవతలారా! నమస్కారం. (అంటూ ప్రణమిల్లి వెళ్లిపోతాడు.)

[దృశ్యం మారిపోయింది]

## 5

*[మానవ చక్రవర్తి మహోన్నత సౌధ గవాక్షంలో నుంచి బయటకు ఉత్కంఠగా చూస్తుంటాడు. ఇవతల రాజకీయ నిపుణుడు, శాస్త్రజ్ఞుడు గాభరాగా నిల్చుని ఉంటారు.]*

రాజకీయ నిపుణుడు: (గాభరాగా) లోకమంతా ఒక మహత్తర కల్లోలం చెలరేగింది. దేవా! చెట్లు సయితం సమ్మె చేశాయి. ఒక్క ఆకుకూడా కదలడంలేదు. (అని చేతిలోని విసనకర్రతో విసురుకుంటాడు. అట్లాగే అందరూ.) అన్ని రాజమార్గాల్లోనూ, మైదానాల్లోనూ, జనపదాల్లోనూ జంతువులు తండోపతండాలుగా నిండిపోయి ఉన్నాయి. పక్షులు భయంకర విమానాల్లాగున ఆకాశమండలం అంతటా అల్లకల్లోలంగా ఎగురుతున్నాయి.

మానవ: (ఆందోళనగా) ఎందుచేత?

రాజకీయ: ఇదంతా మొన్న ఆ వేదాంతి ఇక్కడకు వచ్చినప్పుడు చేసిన పని అంటున్నారందరూ.

మానవ: అంటే?

రాజకీయ: అంటే ఈ జీవరాసుల్లో అగ్నికణాలు చల్లిపోయాడట ప్రభూ!

శాస్త్ర: అవే ఇప్పుడు విప్లవజ్వాలలై లోకాలను దహించివేస్తున్నాయి.

మానవ: (ఆలోచిస్తూ వింటున్నవాడు ఆశ్చర్యచకితుడై) ఏమి ఆ జనసమూహం! సరాసరి ఈ మందిరంలోకే వస్తున్నారు.

శాస్త్ర: తమరి కేదో నివేదించడానికి లాగుంది.

*[ఆతులు ఆ సమూహాన్ని ద్వారం*


పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం ప్రైవేట్ లిమిటెడ్ మదరాసు-17

ఇప్పుడు!
మీ ప్రియమైన
లోమ
(పొమేడ్ రూపంలో)
ట్యూబ్
ప్యాకింగ్‌లో కూడా లభించుచున్నది


● ఎండి పోదు
● పాడు పోదు
● పగిలి పోదు.
కొద్ది జిగటగలది గనుక పనితనం కూడా మంచిది
సోల్ ఏజెంట్లు మరియు ఎగుమతి దార్లు: ఎమ్.ఎమ్. ఖంబట్ వాలా, అహమదాబాద్-1
ఏజెంట్లు: పి. పరోత్తమ్ అండ్ కో., బొంబాయి-2
ఉచితం
'లోమ' ప్రతి పెద్ద సీసాతోను, 'లోమ హెయిర్ పొమేడ్' ట్యూబ్‌తోను ఆహ్లాదం కలుగజేసే సుగంధభరితమైన 'కోహినూర్ అగర్‌బత్తి' ఒక పాకెట్ ఉచితం.
స్టాకిస్టు:
మెస్సర్స్ సిటీ ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, రాజగోపాల్ స్ట్రీట్, విజయవాడ.

దేశశక్తి మీపైన ఆధారపడి ఉంది



మన్నన పొందిన
గృహిణి

ఆమెను అందరూ మెచ్చుకుంటారు.
ఆమె అంత అందంగా కనుపిస్తుంది!
ఎప్పుడూ ఆమె తెల్లని మల్లెపూల
వంటి బట్టలు ధరించియే వుంటుంది.
రాబిన్ బ్లూ నురుగుతో తెల్లని
దుస్తులు మరింత ధవళతరం
కాగలవు.

ARBC-23 TE

రాబిన్ బ్లూ
తెల్లని దుస్తులను మరింత
ప్రకాశవంతం చేస్తుంది




# మబ్బుల్లో దర్బారు

*దగ్గర ఆయుధాలతో ఆపు చేస్తారు.]*

మానవ: (చూచి) ప్రవేశపెట్టు.

భటుడు: ముఖ్యమైనవాళ్ళు మాత్రమే రండి.

ఒకడు: (వచ్చి వంగి నమస్కరించి) మహాప్రభో! గుర్రాలన్నీ "మేము జట్కాబండ్లు లాగము, కావలిస్తే మీరే లాక్కోండి" అని తిరుగుబాటు చేసి వెళ్ళిపోయాయండి.

మానవ: హాఁ! (అని కళ్ళు తిమి గర్జించాడు.)

రెండవవాడు: (అట్లాగే) పోతులూ, ఎద్దూ, 'అరక మీరే లాక్కోం' డని మమ్మల్ని డొక్కలో పొడిచిపోయేయి బాబూ! చూడండి, రక్తపు గాయాలు! (చూపిస్తాడు.)

మానవ: హాఁ! (అని మళ్ళీ గర్జించి ఆసన హస్తాన్ని అరచేత్తో చరుస్తాడు.)

*మూడవవాడు:* ఆవులూ, గేదెలూ పాలు పితకబోతే 'మా పురిటిపాపల నోళ్ళు గొట్టి, గాడిదల్లాగున్నారు, మీ పొట్టల్లో పోసుకుంటారుట్రా?' అని నానా మాటలు తిట్టి వెళ్ళాయి బాబుగోరూ.

మానవ: హాఁ! (అని పండ్లు గీటుతూ ఆసన హస్తాన్ని పదే పదే కొట్టడం ప్రారంభించాడు.) ఇంకా?

నాల్గవవాడు: బాబూ! కోళ్ళూ గొర్రెలూ 'మా పెళ్ళాలను, బిడ్డలను వదలి మీ జిహ్వ చాపల్యానికి బలికావాలట్రా మేము? ఏం న్యాయంరా, యదవల్లారా!' అని మమ్ములను కరచి, గోళ్ళతో రక్కి, పారిపోయాయి. ఏం చేయం బాబూ?

మానవ: నీ వెందుకొచ్చావు?

మరొకడు: మహాప్రభో! తమరి కుక్కల డిపార్టుమెంటు కుక్కలన్నీ సింహాల్లాగున మీద పడుతున్నాయి. గొలుసులు తెంచుకుని పరుగెత్తిపోయి, వీధుల్లో కుక్కల్తో కలిసి ఆ కల్లోలంలో చేరిపోయాయి బాబూ!

మానవ: కుక్కల కే మొచ్చిందిరా?

వాడే: వాటికీ ఈ రోగమే పట్టింది బాబూ. అవీ, 'మీ కూడు తిన్నాం గదా నమ్మకంగా పడుందాం అనుకుంటే, కనకపు సింహాసనమనీ, కుక్కల్లాంటి విశ్వాసమనీ, మమ్మల్ని హేళన చేస్తున్నారు — ఛా యీ నిందలు మేమెందుకు పడాలి?' — అని తిరగబడ్డాయి బాబుగోరూ!

*[ఇంతలో హఠాత్తుగా పురోహితుడు, ప్రజాస్వామ్యం రొప్పుతూ, రొప్పుతూ ప్రవేశించి]*

పురో: మహాప్రభో! కొంప మునిగింది.

మానవ: (ఉత్కంఠతో) ఏమిటో చప్పున వివరంగా చెప్పు.

పురో: వివరంగా ఏమిటి ప్రభూ! చీమల దగ్గరనుంచి సింహాలవరకు జీవకోట్లన్నీ మహా సముద్రంలాగున తమమీదకు దండెత్తి వస్తున్నాయండీ!

మానవ: హేయ్ (అని కేక వేసి చేతిలో ఉన్న గాజు కూజాను గోడమీదకు విసిరికొడతాడు. అది భయంకరంగా పగిలిపోతుంది.)

పురో: పెద్ద టాంకుల్లాగున ఏనుగులు ముందు నడుస్తూ ఉంటే, వెనక మహిష మర్కట మహాకారగాది మృగవాధ యూధమంతా యమకింకర భయంకరమై నడుస్తూ ఉంది. పురోభాగంలో సింహశార్దూలాలు మోటారు సైకిళ్లలాగున పరుగెత్తుతున్నాయి. పైన గండభేరుండ గృధ్ర వాయసాది పక్షిగణాలు విహాయసంలో విమానాల్లాగున రొద చేస్తూ వస్తున్నాయి. మహాప్రభో కనుగీటులో కర్తవ్యం ఆలోచించాలి.

మానవ: (పండ్లు గీటుతూ) ఆ — లో — చిం — చాలి! శాస్త్రజ్ఞుడా! శతఘ్నులు, అణ్వస్త్రాలూ అన్నీ ఆయత్తం చేయించు. కనపడిన జీవరాసులమీదంతా కఠోర జ్వాలా మాలికలు కురిపించు. ప్రళయకాల ప్రతాప దేదీప్యమానుడవై సర్వప్రాణి కోట్లనూ నిశ్శేషంగా సంహారం చేయించు. ఇది నా ఆజ్ఞ.

ప్రజాస్వామ్యం: (హఠాత్తుగా లేచి గద్గద స్వరంతో మహావేశంతో) ప్రభూ! ఇది ఘోరం! మహాఘోరం! వాటి మొర ఆలకించాలి. ఒకరిమీద ఒకరు అధికారం చెలాయించగూడదనీ, స్వయం నిర్ణయ హక్కునీ, పీడితప్రజల దాస్యం తొలగించాలనీ మనలో మనం న్యాయం చేసుకోవడం లేదా? ఆ న్యాయమే వాటికీ మనం అన్వయింపజేయడం మన కర్తవ్యం కాదా? (అంటూ ఉండగా మానవ చక్రవర్తి సమీప భటుని చేతి బల్లెం తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పొడిచివేస్తాడు. బల్లెం శరీరంలో దిగి యువతల్నుంచి అవతలికి వస్తుంది.)

ప్రజాస్వా: (విశ్లథ స్వరంతో) మన ధ — ర్మం — కాదా? (అంటూ నేలమీద కూలిపోతాడు.)

మానవ: అహ్హా హ్హా హ్హా! (అని ప్రళయ మేఘగర్జనలాంటి వికటాట్టహాసం చేస్తాడు. మందిరమంతా మారుమ్రోగిపోతుంది. మిగతా వారు భయభ్రాంతులౌతారు.)

[దృశ్యం మారింది]

6

*[అశేష ప్రాణికోట్లకూ మానవ మహా చక్రవర్తికీ జరిగిన భీకర రణంలో ఆ మహోగ్ర తరుణంలో, భటులూ, ప్రజా నాయకులూ, అమాత్యులూ, అమాయక ప్రజలూ, కూలీలూ, కోటీశ్వరులూ, తల్లులూ, బిడ్డలూ, అనేక అసంఖ్యాక అసంబంధ జన సందోహాలు నలిగి, విరిగి, తునిగి, పెరకబడి, కొరకబడి, త్రొక్కబడి, నుక్కబడి, అనురునురై, జడిసి, మడిసి, రక్తంలో తడిసి, సర్వే సర్వం సహా గోళం హాహాకారాభీలమై దిశావలయం నిశావలయమై, ధగ ధగాయిత ప్రచండ విచండాగ్ని జ్వాలా తోరణ దారుణమై, అతిమారణమై, భూత ప్రేత పిశాచ నిశాచర తాండవ కారణమై, రణమైనంత — అనంతోత్తాల సౌధోపరిభాగం నుంచి మానవరూప దానవుడు కరాళ దంష్ట్రికలు ప్రకటిస్తూ దిశాంతములు ప్రతిధ్వనించేటట్లుగా, తత్తనిస్వాన వికటాట్టహాసాలు వెల్లివిరియిస్తూ నిల్చుని ఉన్నాడు.*

*వేదాంతి మహోన్నత మహీధర శిఖరం మీదనుంచి నిర్వికారుడై, నిర్గుణుడై నిశ్చలుడై ఆ రక్తిజ్వాలా జిహ్వికలను అవలోకిస్తుంటాడు.]*

[దృశ్యం కరగిపోయింది]

7

భూదేవి: (కేశపాశం విరిసిపోయి కంటికి మంటికి ఏకధారగా కన్నీరు కారుస్తూ శోక విహ్వల కంఠంతో) ఆపస్తేజోవాయు దేవులారా! ఓ ఆకాశ ప్రభూ! రండి! ఈ దుర్భర గర్భనరకంనుంచి నన్ను రక్షించండి. ఈ సృష్టి సంసారభారాన్ని ఎంతకాలం మోసేది?

తండ్రీ! సూర్యభగవానుడా! నీవైనా నన్ను నీలో ఐక్యం చేసుకో. నా ధైర్యం గతించింది. నా బలం క్షీణించింది. నన్ను నీలో చేర్చుకో తండ్రీ. (అంటూ వెళ్లిపోయింది.)

ఆపస్తేజోవాయురాకాశాలు: (వెనువెంటనే అదృశ్య కంఠాలతో) తల్లీ భూదేవీ! వస్తున్నాం ఉండు! వస్తున్నాం.

*[తరువాత ఆపస్తేజోవాయురాకాశాలు ప్రవేశించి భూదేవిని కానక]*

ఆకాశం: (గద్గదికతో) పోయావా తల్లీ! పోయావా, మేము ఉండగానే వెళ్లిపోయావా?

వాయువు: దుర్మార్గుడా! మానవుడా! ఇప్పుడు నీ అంతాన్ని ఏ శక్తి నివారిస్తుందిరా? పో — ఉదగ్ర సూర్యగ్రహంలో పడి, ఆటోప రూపసహితంగా అంతరించిపో.

*[అవనీ కల్లోలం అంతా అమేయ తేజోమండలంలో అంతరించిపోతుంది.]*

[దృశ్యం కరగిపోతుంది] ★

# విజిగీష

## ఆర్. సుందర్‌సింగ్

జీవన్మరణాల సరిహద్దుల్లో
భ్యాదలిజం ప్రచ్ఛన్న విహారం చేస్తోంది.
జానిసత్వం నాగరికంగా జన్మించింది.
ప్రేరేపణ, ప్రేరణలు జగన్నాటక
నాందీ, ప్రస్తావన లైనాయి.

బలహీనత మానవత్వానికి చిహ్నమయ్యింది;
అహంలో జనించిన అసంతృప్తిని
సంతృప్తిగా మార్చుకుంది మానవత్వం.
మానవుని కోరికలు తారకలై
పక్కున పగలబడి నవ్వాయి;
కారణాల తోరణాలు జిజ్ఞాసను మేల్కొల్పి
మానవుని కార్యోన్ముఖుని చేశాయి.

మస్తిష్కాల మూసల్లో
జంత్రాలు దొంతర్లుగా దొర్లాయి.
అందాల చందమామను
ముందుగా ఆక్రమించాలనే తపన
ఆశల రెక్కలపై అంతరిక్ష పరీక్ష చేస్తోంది.

బ్రతుకులో ఆలోచన భాగం కాదు;
ఆలోచనే బ్రతుకుగా రూపొందింది.
అరిషడ్వర్గాల అజమాయిషీలో
బానిసగా వినమ్రుడైనాడు మనిషి.

కక్షల కార్పణ్యాల రాక్షస చైనాలో
రాజ్యకాంక్ష రంకులాడి విశృంఖల నృత్యం.
ఉచ్చ నీచ తరతమ భేదాల ఉదంతం
గతంలో మతం అప్పుతెచ్చుకున్న వృత్తాంతం.
ఏదో చెయ్యాలని మంగాహటి చెయ్యడం,
ఆశించిన సందుకోలేక పోవడం,
మరుగులేని మానవనైజాలు.
సంకల్పాలన్నీ సాధించగల్గితే
మానవుడే మహోన్నతుడౌతాడు:
ఓటమి — చరిత్రకు పునరావృత్తి. ✱